క్లుప్తంగా

విద్యాప్రమాణాలు మెరుగుపర్చాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

సరుబుజ్జిలి: పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుకోసం అధ్యాపకులు పనిచేయాలని ఎంఈఓ-2 కంచరాపు శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పర్వతాలపేట ప్రాథమిక పాఠశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువుల స్థితిగతులు, బోధనల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలుసూచనలు చేశారు.

వేళలు పాటిస్తే వేతనం గిట్టుబాటు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ శివానందమూర్తి

సరుబుజ్జిలి: ప్రభుత్వం నిర్దేశించిన వేళల ప్రకారం ఉపాధి పనులు చేస్తే గరిష్ఠ వేతనం గిట్టుబాటు అవుతుందని వైస్ ఎంపీపీ జి.వి.శివానందమూర్తి తెలిపారు. మండలంలోని సింధువాడ గ్రామంలో ఉపాధి హామీ సోషల్ ఆడిట్ గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలు, నిధుల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోవిందు కామేశ్వరి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, వేతనదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యుత్ లైన్లు వేస్తున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

సేవా మార్గం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లత

నరసన్నపేట: ప్రతిఒక్కరూ సేవా మార్గం అలవర్చుకోవాలని నరసన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. కళాశాలలో జాతీయ సేవా పథక దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు దైవంతో సమానమన్నారు. మానవ సేవే మాధవ సేవ అన్న వివేకనందుడి మాటల్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎన్ఎస్ఎస్ రెండు యూనిట్ల పీఓలురవికుమార్, అన్నాజీరావు తదితరులు పాల్గొని విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ఆవశ్యకతను వివరించారు.

నగదు రహిత లావాదేవీలపై శిక్షణ

మెళియాపుట్టి: సచివాలయాలలో జరుగుతున్న కార్యకలాపాలకు సంబంధించి నగదు రహిత లావాదేవీలు చేపట్టాలని ఎంపీడీఓ చంద్రకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ సదస్సు సోమవారం ఏర్పాటు చేశారు. విద్యుత్ సుంకాలు, ఇంటి పన్ను, లేఅవుట్ ఫీజులు, తదితర సేవలను ఫోన్‌పే.. ఇతర క్యాష్ లెస్ ట్రాంజక్షన్ ప్రక్రియలలో నిర్వహించాలన్నారు. దీనిపై ప్రజలకు సైతం అవగాహన కల్పించాలన్నారు. బావులను క్లోరినేషన్ చేయించాలని, కుళాయి ట్యాంక్‌లను పరిశుభ్రం చేయాలని, దోమల నివావరణ మందు స్ప్రే చేయించాలన్నారు. ఏఓ తిరుపతి పట్నాయక్ పాల్గొన్నారు.

ఒడియా భాష ఉన్నతికి కృషి



పుస్తకావిష్కరణ చేస్తున్న ఒడియా ఉపాధ్యాయులు

ఎల్.ఎన్.పేట: ఒడియా భాష, సంస్కృతి ఉన్నతికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఒరియా లిగ్విస్టిక్ మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాడి అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సింహాచలం అధ్యక్షతన మధు బర్ణబొధ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకం ప్రాథమిక స్థాయి, స్లో లెర్నర్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఒడియా భాష, సంస్కృతి ఉన్నతికి కృషి చేస్తున్న ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ బరోడో, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దోళాయి, మాజీ అధ్యక్షుడు రఘునాథ్ గౌడ్, దుర్గా పాడి, ఉత్కళ సమ్మిళనీ సూపర్‌వైజర్ ప్రదోష కుమార్ త్రిపాఠి పాల్గొన్నారు.

• నీరు మళ్లింపు



సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ రహదారిలో వర్షంనీరు తరలించే ఏర్పాట్లు సోమవారం చేపట్టారు. అలికాం-బత్తిలి రహదారిలో సరుబుజ్జిలి గ్యాస్ గొడౌన్ సమీపంలో ఆర్అండ్‌బీ స్థలాలను రియల్ వ్యాపారులు ఆక్రమించారు. మట్టితో కప్పేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మట్టిని తొలగించి రహదారిపై నీటిని మళ్లించే పనులు చేపట్టారు. పోలీసులకు స్థానికులు, వాహనదారులు అభినందనలు తెలిపారు.

– సరుబుజ్జిలి

• భగవద్గీత పారాయణం



శ్రీకృష్ణుడు ఉపదేశించిన భగవద్గీతను సోమవారం విజయనగరంలోని మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో పారాయణం చేశామని నరసన్నపేట గీతా మందిరం నిర్వాహకులు సూరిబాబు తెలిపారు. గీతా మండలి సభ్యులు 30 మంది శ్రావణ మాసం సందర్భంగా పురాతన వేణుగోపాలస్వామి క్షేత్రాలకు వెళ్లి భగవద్గీతను పారాయణం చేస్తున్నామన్నారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలను 18 శ్రీకృష్ణ క్షేత్రాల్లో పారాయణం చేసేందుకు సంకల్పించామన్నారు. ఇప్పటివరకు ఐదు ఆలయాల్లో భగవద్గీత పారాయణం పూర్తిచేశామన్నారు.

– నరసన్నపేట

• ఉత్సాహంగా..



మెళియాపుట్టి మండలంలోని చాపర గ్రామంలోని పెద్దదేవాంగుల వీధిలో వినాయక ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉట్టిని కొట్టేందుకు యువత పోటీపడ్డారు. ఏడురోజుల పాటు గణేషునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనా కార్యక్రమాలు, కుంకుమపూజలు హోమాలు చేపట్టారు. ప్రతీఏటా వినాయక ఉత్సవాలను వీధివాసులంతా కలిసి ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

– మెళియాపుట్టి

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

• గ్రామాల్లో ఇంటింటా సర్వే

సారవకోట: ఈ నెల 30 నుంచి జరగనున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ నక్క తులసీదాస్ సూచించారు. మండలంలోని చిన్నగుజ్జువాడ సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ఈ కార్యక్రమంపై సోమవారం అవగాహన నిర్వహించారు. గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతుందన్నారు. సర్పంచ్‌లు కొండాల బాబూరావు, తాడేల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

ఉర్లాం పీహెచ్‌సీ పరిధిలో

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం పీహెచ్‌సీలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా గ్రామాల్లో ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలో నడగాం, కోమర్తి, వీఎన్‌పురం గ్రామాల్లో ఇంటింటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. హెచ్‌బీ, బీపీ, సుగర్, యూరిన్, మలేరియా, డెంగీ తదితర పరీక్షలు నిర్వహించారు.

ఆరోగ్య భరోసా..

కొత్తూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఆరోగ్య భరోసాగా ఉంటుందని గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ గండివలస ఆనందరావు అన్నారు. కొత్తూరులో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వనము లక్ష్మీనారాయణ, నాస బాలకృష్ణ, పంకజదాస్, హరిదాసు, రాజులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి..

హిరమండలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని పార్టీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్ కోరారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 30వ తేదీ నుంచి గ్రామ సచివాలయాల వారీగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చైతన్యపరచాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వంగపల్లి చిన్నారావు, హిరమండలం ఉప సర్పంచ్ వి.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కొరసవాడలో ఇంటింటా సర్వే..

పాతపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంలాంటిదని బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు శ్రీధర్ అన్నారు. మండలంలోని కొరసవాడ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వే సోమవారం నిర్వహించారు. కుటుంబంలో ఉన్న ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కుటుంబ సభ్యుల వైద్య వివరాలు నమోదు చేసుకుంటామన్నారు. సర్వేలో బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, కంటి, ఇతర ఆరోగ్య పరీక్షలు చేస్తామన్నారు. గుర్తించిన వ్యాధుల తీవ్రతను మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ ఉమ, సెక్రటరీ కృష్ణంరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నరసన్నపేట: వీఎన్‌పురంలో తనిఖీలు చేపడుతున్న ఉర్లాం పీహెచ్‌సీ సిబ్బంది



పాతపట్నం: కొరసవాడలో ఇంటింటా సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



సారవకోట: మాట్లాడుతున్న తులసీదాస్



కొత్తూరు: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హిరమండలం: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం

• అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. నాలుగున్నరేళ్ల పాలనలో మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. మహిళలకు ఆర్థిక భారం తగ్గించి, ఆర్థిక స్వేచ్ఛ ఇచ్చేందుకు అనేక పథకాల ద్వారా వారి ఖాతాలకు నగదు జమచేశారని గుర్తుచేశారు. మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యత అంశాల్లో అమ్మఒడి అధిక ప్రాధాన్యం సంతరించుకుందన్నారు. 2019 నుంచి 2023 వరకు అమ్మఒడి పథకం ద్వారా రాష్ట్రంలో 44,48,765 మంది తల్లులకు ఏడాదికి ఒకసారి నగదు జమచేశారని గుర్తుచేశారు. ఏడాదికి రెండు విడతల్లో జగనన్న వసతి దీవెన పథకం ద్వారా 25,17,245 మందికి నేరుగా లబ్ధి చేకూరిందన్నారు. ఏడాదికి నాలుగు విడతల్లో జగనన్న విద్యా దీవెన 27 లక్షల మంది తల్లుల ఖాతాల్లో జమచేయటం జరిగిందన్నారు. రైతు భరోసా పథకం ద్వారా కేవలం మహిళా రైతులు 22 లక్షల మందికి లాభం చేకూరేలా నిధులు విడుదల చేస్తున్నారని గుర్తుచేశారు. వైఎస్సార్ సున్న వడ్డీ, పంట రుణాలు 7.38 లక్షల మంది మహిళా రైతులకు మేలు జరిగేలా అవసరమైన నిధులు విడుదల చేశారన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా 8.21లక్షల మంది మహిళా రైతులకు వర్తించేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇన్‌పుట్ రాయితీలో 5.68 లక్షల మంది మహిళలకు లాభం చేకూరేలా నిధులు విడుదల చేస్తున్నారని గుర్తుచేశారు. 4,868 మంది మత్స్యకార మహిళలకు మంచి జరిగేలా నిర్ణయం తీసుకుని, ఇచ్చిన మాట ప్రకారం సకాలంలో నిధులు విడుదల చేస్తున్నారన్నారు. డ్వాక్రా సున్నా వడ్డీ పథకం ద్వారా 1.05 కోట్ల మంది మహిళలకు మేలు చేకూరిందన్నారు. మహిళల సంక్షేమం కోసం నిరంతరం ఒక అన్నలా ఆలోచిస్తూ ఎన్నో పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

రూ.30 లక్షల పరిహారం అందజేత

నరసన్నపేట: నరసన్నపేట ఎస్‌బీఐలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి గుడ్ల రామజోగికి పెన్షన్ ఖాతా ఉంది. ఈయన ఇటీవల పాము కాటుకు గురై మృతి చెందారు. ఆయన పేరున ఎస్‌బీఐ చేసిన ఇన్సూరెన్స్ చేయడంతో రూ.30 లక్షలు మంజూరైంది. ఈ మొత్తాన్ని మృతిని భార్య భారతి, సోదరుడు గుడ్ల శ్రీనివాసారావు, కుమారులు ఢిల్లేశ్వరరావు, సాయి శ్యామ్‌సుందర్‌కు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రుప్ప సురేష్ సోమవారం అందించారు. ఎవరైనా ఉద్యోగులు, పెన్షనర్లు ఉచిత ప్రమాద బీమా పొందవచ్చన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు తమ జీతం అకౌంట్ సరైన ప్యాకేజీలో ఉందా, లేదా అని చెక్ చేసుకోవాలని సూచించారు. బ్యాంక్ సర్వీస్ మేనేజర్ వీరభద్రరావు, ఫీల్డ్ ఆఫీసర్ కల్యాణ చక్రవర్తి ఉన్నారు.



ఇన్సూరెన్స్ మొత్తాన్ని రామజోగి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

కొత్తూరు: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేందుకు హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని గూనభద్ర పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కల్లేపల్లి వైకుంఠరావు, లబ్ధిదారులు సోమవారం శ్రీకాకుళంలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలో 75 మందికి జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయన్నారు. 20 అడుగుల వెడల్పు, 33 అడుగుల పొడుగు కొలతలతో ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు 12 అడుగుల వెడల్పు, 55 పొడుగు కొలతలో పట్టాలు అందజేశారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతలు లేకపోవడంతో హౌసింగ్ అధికారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేందుకు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వ కొలతల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలన్నారు. స్థలం చాలకపోతే మరోచోట స్థలం చూసి పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, లబ్ధిదారులు

ఎన్‌హెచ్‌ఎం నిధులు విడుదల చేయాలని వినతి

పోలాకి: హెల్త్ క్లినిక్ నిర్మాణానికి అదనంగా నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నుంచి నిధులు మంజూరు చేసినప్పటికీ అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఆ నిధులు మంజూరులో జాప్యం జరిగిందని, దీంతో హెల్త్‌క్లినిక్ నిర్మాణంలో ఇబ్బందులు ఉన్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ జె.నివాస్ దృష్టికి పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్య తీసుకువెళ్లారు. విజయవాడలోని కార్యాలయంలో సోమవారం కలిసి శాఖాపరమైన సమస్యలను తెలియజేశారు. ఖాళీగా ఉన్న ఆశ కార్యకర్తల పోస్టుల తోపాటు సచివాయాల్లో ఏఎన్ఎం పోస్టుల భర్తీని చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందించారని కృష్ణచైతన్య తెలిపారు. ఎన్‌హెచ్‌ఎం నిధుల కోసం ఇప్పటికే జీఓ జారీ చేశామని, జిల్లా ఎస్ఈతో అక్కడికక్కడే ఫోన్లో మాట్లాడారు. ఖాళీగా ఉన్న పోస్టులను కోవిడ్ సమయంలో పనిచేసినవారికి ప్రాధాన్యత ఇస్తూ భర్తీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు.



నివాస్‌కు సమస్యలు వివరిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

అటవీ భూముల ఆక్రమణలు అడ్డుకోవాలి

పొందూరు: పొందూరు, లావేరు మండలాల సరిహద్దులో ఉన్న తండ్యాం, కొత్తకుంకాం గ్రామ పంచాయతీల పరిధిలో గల 30 హెక్టార్లలో అటవీశాఖ సంరక్షిస్తున్న జీడితోట ఆక్రమణకు గురవుతుందని జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో తండ్యాం గ్రామానికి చెందిన పలువురు సోమవారం ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్‌కు, జిల్లా అటవీశాఖ అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. ఈ తోటలను ప్రతీ ఏడాది వేలంపాట వేస్తూ 60 శాతం గ్రామ పంచాయతీకి, 40 శాతం ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారికి అందజేస్తున్నారు. ఈ కొండపై ఆక్రమణలను అడ్డుకోవాలని అధికారులను కోరారు.



జీడితోటలో మట్టి తవ్వి చదును చేసిన దృశ్యం

ఐదు వాహనాల వేలం

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) స్టేషన్ ఆవరణలో ఎస్ఈబీ సీఐ వై.లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో సోమవారం వేలంపాట నిర్వహించారు. ఐదు ద్విచక్ర వాహనాలు జీఎస్‌టీతో కలిపి రూ.50,032లకు పాటదారులు దక్కించుకున్నారని ఎస్ఐ ఎస్‌జీఎల్ దస్తాగిరి తెలిపారు. ఎస్ఈబీ పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



నందిని

ఎల్.ఎన్.పేట: జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీల్లో మండలంలోని కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కుప్పిలి నందిని (9వ తరగతి) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్ఎం పాలక రామారావు, పీడీ డి.యశోద తెలిపారు. అండర్ 17 విభాగంలో నందిని సత్తా చాటిందన్నారు. నందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావటం పట్ల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఆధ్యాత్మిక సందడి



కొత్తూరు: కోలాటం చేస్తున్న హరి శ్రీనివాస బృందం సభ్యులు

కొత్తూరు: స్థానిక అల్లు వీధిలో గల వినాయక మండపం వద్ద సోమవారం రాత్రి కొత్తూరుకు చెందిన హరే శ్రీనివాస కోలాటం బృందం చేసిన కోలాటం ఆకట్టుకుంది. లలిత సహస్ర నామ శ్లోకాలను పఠించారు. నేతాజీనగర్ కాలనీలోని అంబేడ్కర్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద లక్ష దీపారాధన ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రెల్లివీధిలోని వినాయక విగ్రహాన్ని ఊరేగించి అనంతరం నిమజ్జనం చేశారు.

ఏకాహం..

బూర్జ: మండలంలోని పనుకుపర్త గ్రామంలో గల వినాయకుని వద్ద 10 భజన బృందాలతో 24 గంటలు అఖండ ఏకాహం నిర్వహించారు. సోమవారం భజన బృందాలు గ్రూపుల వారీగా ఏకాహం నిర్వహించాయి. కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: చింతలబడవంజ వద్ద అన్నదానం

అన్నసమారాధన

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంతోపాటు చింతలబడవంజ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద సోమవారం అన్నసమారాధన కార్యక్రమాలను కమిటీ సభ్యులు చేపట్టారు. స్థానికులతో పాటు ప్రయాణికులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

• 58 రకాల వంటలతో నైవేద్యం



నరసన్నపేటలోని జోగపేట కూడలిలో ఆ వీధి వాసులు చౌతా షణ్ముఖరావు ఇంటి వద్ద వినాయక నవరాత్రులు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం 58 వంటకాలతో విఘ్నేశ్వరునికి నైవేద్యం సమర్పించారు. ఆ వీధికి చెందిన మహిళలు వంటలను ఊరేగింపుగా తీసుకువచ్చి నైవేద్యంగా పెట్టారు.

– నరసన్నపేట

చురుగ్గా జల్ జీవన్ మిషన్ పనులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని శ్యామలాపురం వంశధార పునరావాస కాలనీలో జల్ జీవన్ మిషన్ పైపులైన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇంటింటికీ తాగునీటి పైపులైన్ పనులు చేపట్టినట్లు సర్పంచ్ బలగ లక్ష్మి తెలిపారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందివ్వటమే లక్ష్యంగా తీసుకున్నామన్నారు. మరో వారం రోజుల్లో పైపులైన్ నిర్మాణ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



పైపులైన్ పనులు చేపడుతున్న దృశ్యం